మాస పత్రిక

Monthly Magazine


Volume : 2 Issue : 1. May, 2017

# యుగభారత్

YUGABHARATH

Hyderabad


- సంపుటి : 2
- సంచిక : 1
- మే. 2017
- Pages : 44
- Rs. 10/-





# ఓబిసి కమీషన్‌కు చట్టబద్ధత

## పార్లమెంటులో ప్రజా విజయం

# నాదో చిత్రమైన ప్రేమకథ!

■ ప్రతాప వెంకట సుబ్బారాయుడు



సాధారణంగా అబ్బాయిలు అమ్మాయిల వెంటపడి (వేధించి) ప్రేమిస్తే, వాళ్లు చివరికి ఇంట్లో వాళ్లను ఒప్పించలేక మరో కతణ్ని పెళ్లి చేసుకుంటే అబ్బాయిలు దేవదాసులవడం..లేదా ప్రాణాలను తీసుకోవడం..ప్రేయసి మీద ప్రేమతో తాజ్ మహల్ లాంటి చారిత్రక కట్టడాలను నిర్మించడం..ఇవి మీకు తెలుసు. కాని నాదలాంటి లవ్ కాదు-

టీనేజ్ లోకి రాగానే ప్రేమ అనే జాఢ్యం మొదలవుతుంది. ఆపోజిట్ సెక్స్ ను చూడంగానే రిమ్మతెగులు పుడుతుంది. ఎలాగైన వాళ్లకు దగ్గరవ్వాలన్నతహ తహతో అడ్డదార్లో, నిలువుదార్లో తొక్కుతాం. కాని నాకు మాత్రం అంత కష్టం ఎదురుకాలేదు. అందరికీ ఉన్నట్టే నాకూ ఓ గర్ల్ ఫ్రెండ్ ఉంటే బాగుంటుందనుకుని జస్ట్ అలా బస్టాప్ కెళ్లి నుంచుని నాకు కొద్దిదూరంలో ఒక మోస్తరు అందంతో నుంచున్న మొద్దుగుమ్మను చూసి నవ్వాను. ఆమె నా కాలేజీలోనే చదువుతుంది. బహుశా నాకు జూనియరేమో. ఆమె నా దగ్గరగా వచ్చింది. తిట్టడమో చెప్పుతీసుకుని కొట్టడమో చేస్తుందనుకున్నాను..కానీ 'ప్రేమా..' అంది మాటల్ని వయ్యారంగా వదులుతూ..నేను 'ఊ' అన్నాను మాయామోహితుడ్నయి..

అంతే ఇద్దరం బస్సులో కాలేజీకి వెళ్లవలసిన వాళ్లం ఆటోలో వెళ్లాం నా డబ్బుతో. నాకు ఎంతో ఆనందంగా ఉంది. నాకూ ఓ గాళ్ ఫ్రెండ్ ఉంది. కాలేజీ ముందు ఆమెతో బస్సులోంచి దిగి, క్యాంపస్ లో అందరూ చూస్తుండగా ఆమెతో నడవడం. ఓ అదృష్టమంటే అదేకదా!

నేను ఆమెతో నడుస్తుంటే బాధగా, ఈర్ష్యగా చూడాల్సిన వాళ్లు 'ఒక రకంగా' చూస్తున్నారు. నేను ఆ రకం చూపుల్ని, నాకు నచ్చిన రకంగా అన్వయించుకుని ఆమెతో సొల్లు వాగుడు వాగుతూ క్యాంపస్ అంతా గర్వంగా కలయ తిరిగేసాను.

టైం భలే గడిచిపోతోంది. ఆమెని ఎలా, ఎక్కడ కలవాలి? ఎలాంటి ప్రత్యేక గిఫ్ట్ ఇచ్చి ఆకర్షించాలి? ఈ మధురోహలు సదా నా మనసును ఆక్రమించుకుని మత్తెక్కించేవి. ఇదివరకు ఊర్నుంచి నెలకోసారి కష్టపడి సంపాదించిన డబ్బు పంపితే నేను చాలా జాగ్రత్తగా కర్చు పెట్టుకునేవాడిని. అలాంటిదిప్పుడు నెలకు రెండు..మూడు సార్లు ఏవేవో సాకులు చెప్పి డబ్బు తెప్పించుకుంటున్నాను..ప్రణయ దేవత కనికరించాలంటే తప్పదు కదా మరి!

ఒకరోజు హడావిడిగా ఆమె నాకు కాల్ చేసి 'రేపుదయం ఆరు గంటలకు మా అమ్మా నాన్నా రైల్లో వస్తున్నారు..నువ్వు క్యాబ్ లో వెళ్లి వాళ్లను పికప్ చేసుకోవా..ప్లీజ్' అంది.. మాటల్ని మత్తు మత్తుగా వదులుతూ..

మా అమ్మానాన్న ఎప్పుడన్నా నన్ను చూడడానికి వస్తే కనీసం ఆటోలో కూడా తేను. బస్సులోనే ప్రయాణం.

ఇప్పుడు మాత్రం "అలాగే డియర్" అన్నాను.

రైల్వే స్టేషన్ కు వెళ్ళేటప్పుడు ఎర్లీగా బస్ లో వెళ్లి, వాళ్ల అమ్మానాన్నలను క్యాబ్ లో తీసుకొస్తుంటే మధ్యలో "నాయనా ఎప్పుడో ఇంట్లో ఇంత తిని బయల్దేరాం.. ఆకలేస్తోంది. మంచి హొటల్ కు తీసుకెళ్లు. కాస్త టిఫిన్ తిన్నాక మందులు కూడా వేసుకోవాలి..అఉ అంది వాళ్లమ్మ.

నేను క్యాబ్ ను హొటల్ ముందు ఆపించి వాళ్లను లోపలికి తీసుకెళ్లాను. వారు టిఫిన్‌ను భోజనం లెవెల్లో లాగించారు. ప్రేయసి అంటే ప్రేముంటుంది కాని..వాళ్లమ్మా నాన్నా అంటే ఎందుకుంటుంది? బాధను మునిపంట భరించి.. పర్సులో భద్రంగా దాచుకున్న డబ్బు తీసి కౌంటర్ లో కట్టి, క్యాబ్ వైపు నడిచాను. వాళ్లు త్రేన్చుకుంటూ మంద గమనంతో అనుసరించారు.

వాళ్లు ఎప్పుడూ సిటీ చూడలేదని అందు చేత వాళ్లను రామోజీ ఫిల్మ్ సిటీకి, గోల్కొండకు, ఎన్ టి ఆర్ గార్డెన్ కు, లుంబిని పార్క్ కు తిప్పమంది.

నేను ఫ్రెండ్స్ దగ్గర దొరికినకాడికి అప్పు చేసి వాళ్లను తిప్పాను.

ఒక శుభముహూర్తాన వాళ్లు తిరిగి ఊరెళ్లిపోయారు. నాకు పంచామృత స్నానం చేసినట్టుగా అనిపించింది.

చేసిన అప్పులు తీర్చడానికి పొద్దున్నపూట పేపర్లు, పాలప్యాకెట్లు వేస్తున్నాను. కాలేజీ నుంచి రాగానే హొటల్‌లో వెయిటర్గా పని చేస్తున్నాను. ఆమె జల్సాలకు ఎంత డబ్బూ సరిపోవడం లేదు.

కొన్నాళ్ల తర్వాత..ఒకరోజు ఖాళీగా ఉన్నాప్పుడు చేతులు పూర్తిగా కాలకుండానే ఆమెతో పరిచయం అయినప్పటి నుంచి నా

(తరువాయి 20)

# నాదో చిత్రమైన ప్రేమకథ

(19వ పేజీ తరువాయి)

జీవితాన్నిరివ్యూ చేసుకున్నాను. మొత్తమంతా లోటు బడ్జెటే! ఇలా అయితే మానసికంగా, శారీరకంగా దివాళా తీయడమే! 'హమ్మో' ఇంక దాన్ని వదిలించుకోవాలి. దాంతో ఆనందం మాట ఎలా ఉన్న మొత్తం గొరుక్కుపోవడం ఖాయం. నన్నందరూ అలా 'ఒక రకం'గా ఎందుకు చూశారో అప్పుడర్థమైంది.

నేను కాలేజీ మానేశాను. ఆమె కాల్స్ రిసీవ్ చేసుకోవడం మానేశాను.

దాదాపు అజ్ఞాతంలోకి వెళ్లిపోయాను.

ఒకరోజు యధాలాపంగా పేపర్ తిరగేస్తుంటే– నా ఫోటోతో ఒక ప్రకటన–

"ఇతను నా ప్రేమికుడు. కొంతకాలంగా ఎక్కడున్నాడో తెలియడం లేదు. ఇతను లేకుండా ఉండలేకపోతున్నాను. దయచేసి ఎవరికైనా కనిపిస్తే నా బాధ కరుణరసాత్మకంగా చెప్పి నన్ను కలవమని చెప్పగలరు" కనిపించింది.

ఇది నా కొంప ఇలా ముంచిందేమిటి? చూసిన వాళ్లేమనుకుంటారు? నేను వెంటనే దానికి ఫోన్ చేసి సాయంత్రం పార్క్ లో కలుస్తానని చెప్పాను.

సాయంత్రం పార్క్ లో– "ఏంటిది" పేపర్ ప్రకటన చూపిస్తూ కోపంగా అడిగాను.

"మన ఆత్మీయులు కనిపించకపోయినా, తప్పిపోయినా బాధతో ప్రకటన ఇస్తాం కదా. ఇదీ అంతే!" అంది నింపాదిగా. ఆమె మాటల్లో 'దొరికిందిరా పిట్ట' అన్న భావం అంతర్లీనంగా కనిపించింది.

"ఇలా చేయడం ఏం బాలేదు"అన్నాను చిన్న పిల్లాడిలా.

"మరి నువ్వలా చేయడం బాగుందా? మీ మగాళ్లు ముందు మా చుట్టూ తిరిగి, ఆతర్వాత మమ్మల్ని మీ చుట్టూ తిప్పించుకుంటారు. మేమేమో 'ఆకెళ్లి ముళ్లు మీద పడ్డా, ముళ్లెళ్లి ఆకు మీద పడ్డా' అనుకుంటూ భయం భయంగా కాలం గడపాలి. నేనలాంటి దాన్ని కాదు. పిచ్చ డేరింగ్, డాషింగ్. నిన్ను నేనెలాగూ పెళ్లి చేసుకోను..ఎందుకంటే నన్ను భరించే సత్తా నీకు లేదు. కనీసం మంచి పొజీషన్, ఆస్తీ, అంతస్థూ ఉన్నవాడు నాకు దొరికి, నేను వాడిని తగులుకునే వరకు నువ్వే నా బాయ్ ఫ్రెండ్ వి. నన్ను భరించాల్సిందే తప్పదు. పారిపోవడాల్లాంటి పిచ్చి పనులు చేయకు. ఒకవేళ చేస్తే ఏమవుతుందో శాంపుల్ చూశావుగా..అర్ధమైందా?"అంది మాటల్లో కాఠిన్యాన్ని గుప్పిస్తూ.

'నేనలా చేయకపోతే' అన్నాను మేకపోతు గాంభీర్యంతో. "ఇప్పుడు నేనిచ్చిన ప్రకటన పోలీసు ఉన్నతాధికారులతో సహా అందరూ చూశారు. నాకేం జరిగినా దానికి బాధ్యుడివి నువ్వే అవుతావు. ఈ ఝలక్ చాలనుకుంటా..వెళ్లి చాకోబార్ ఐస్ క్రీం తీసుకురా, నీకింత క్లాస్ తీసుకునేసరికి గొంతెండిపోయింది" అంది.

నేను ఐస్ క్రీం తేవడానికి లేచాను భారంగా.

(కథలో నేను అబ్బాయికి అమ్మాయికి పేర్లు పెట్టలేదు కారణం..మీ పేర్లతో సహా కావలసినవి పెట్టుకోవచ్చు) ■

# మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు

(18వ పేజీ తరువాయి)

శక్తివంతమైన శతఘ్నులు ప్రయోగించింది, రామరాజు అనుచరులు కొంతమంది మృతి చెందారు. విప్లవదళానికి దెబ్బమీద దెబ్బగా.. తప్పించుకున్న విప్లవ వీరుల స్థావరాలపై ప్రభుత్వ సైన్యం దాడిచేసి మరో 8 మంది విప్లవ వీరులను మట్టుబెట్టాయి. అయుధాలు పోలిసుల వశమయ్యాయి. ఆ తర్వాత నాలుగు నెలలపాటు విప్లవ దళాలు స్థబ్దుగా ఉండిపోయాయి. సీతారామరాజు చనిపోయాడన్న వార్తలు వ్యాపించాయి. అయినా అనుమానం తీరని ప్రభుత్వం రామరాజును పట్టిచ్చిన వారికి బహుమతులు ప్రకటించింది. స్పిన్, హ్యూమ్, వంటి అధికారులు జాగ్రత్తగా వ్యూహా రచన చేశారు. 1922 డిశంబరు 5న విప్లవదళాలు ధారకొండవైపు వెళ్ళారని తెలిసి బ్రిటిష్ అధికారులు, ఇతర సిబ్బంది వేట ప్రారంభించారు. డిశంబరు 6న పెద్దగడ్డ పాలెం వద్ద ఇరు వర్గాలకు జరిగిన పోరులో మొత్తం 13మంది విప్లవకారుల శవాలను ఊరేగించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు.

1923 ఏప్రిల్ 17న అన్నవరం కొండపై రామరాజు తన అనుచరులతో ప్రజలను కల్సుకుని, బ్రిటిష్‌వారి ఆగడాలను అరాచకాలను తెల్సుకుని ఉద్యమాన్ని ఉధృతం చేశాడు. బ్రిటిష్ పాలనకాదని పంచాయతీ పాలన ప్రవేశపెట్టాడు. 1923 ఏప్రిల్ 23న రామరాజు అనుచరుడైన మల్లుదొర ఒక యువతి ఇంట్లో ఉండగా పోలీసులు పట్టుకున్నారు. తర్వాత అగ్గిదొరను పోలీసులు కాపుకాసి పట్టుకున్నారు. బ్రిటిష్‌వాళ్ళు విప్లవాన్ని అణచివేసేందుకు ప్రజల్ని భయభ్రాంతుల్ని చేస్తూ, మన్యాన్ని ముట్టడించి, వారికి ఆహారపదార్థాలు అందకుండా చేశారు. స్త్రీలని, పిల్లలను, వృద్ధుల్ని విచక్షణా రహితంగా కాల్చిచంపసాగారు.

**మరణం:** 1924లో మన్యానికి స్పెషల్ కమిషనర్‌గా రూథర్‌ఫర్డ్ వచ్చాడు. విప్లవాన్ని అణచివేసే ప్రయత్నంగా కృష్ణదేవిపేటలో సభ నిర్వహించి, వారం రోజులలోగా విప్లవాకారుల ఆచూకీ తెలుపకపోతే కాల్చి చంపుతామని ప్రకటించాడు. ఆరోజు రాత్రి మంప గ్రామానికి వచ్చాడు రామరాజు. గ్రామ మున్సబుని కలుసుకుని.. తనవల్ల ప్రజలు బాధలు పడుతున్నారని తాను ప్రభుత్వానికి లొంగిపోవాలని నిర్ణయించుకున్నానని చెప్పాడు. ఆ విషయం ప్రభుత్వానికి తెలుపమని రామరాజు మున్సబుని కోరాడు దానికి మున్సబు అంగీకరించలేదు.

1924 మే 7న ఏటి ఒడ్డున కూచుని, ఓ పశువుల కాపరి ద్వారా తానున్నచోటు పోలీసులకు కబురంపాడు. ఏటిలో స్నానం చేస్తున్న రామరాజును పోలీసులు చుట్టుముట్టి పట్టుకున్నారు. కోయ్యూరు సమీపంలో ఉన్న చింతచెట్టుకు బందీ అయిన రామరాజును కట్టివేసి, ఏ విచారణ లేకుండా మేజర్‌గుడాల్ పిస్టల్‌తో కాల్చిచంపాడు. 27 ఏళ్ళ వయసులోనే రామరాజు మన్యం కోసం ప్రాణాలర్పించాడు. రామరాజు మరణించినా విప్లవం ఆగలేదు 1922 ఆగష్టు 22న మొదలైన విప్లవం 1924 జూలై మొదటి వారం వరకు కొనసాగింది.

■